233) శంకరాభరణం

ప॥ మతంగపర్వతమాడ మాల్యవంతమునీడ। అతిశయిల్లినపెద్దహనుమంతు డీతడు॥

చ॥ యీతడా రామునుబంటు యీతడా వాయుసుతుడు। ఆతతబలాఢ్యు డందు రాత డితడా।
సీతనువెదకివచ్చిచెప్పినయాత డితడా। ఘాతలలంకలోని రాక్షసవైరి యితడా॥

చ॥ అంజనాసుతు డీతడా అక్షమర్దను డీతడా। సంజీవినికొండ దెచ్చె సారె నితడా।
భంజించె గాలనేమిని పంతమున నితడా। రంజితప్రతాపకపిరాజసఖు డితడా॥

చ॥ చిరంజీవి యితడా జితేంద్రియు డితడా। సురల కుపకారపుచుట్ట మీతడా।
నిరతి శ్రీవెంకటాద్రిని విజనగరములో-। నరిది వరములిచ్చీ నందరికి నితడా॥